క్లుప్తంగా

వినతుల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆర్డీఓ వసంతబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

నర్సులు సమాజ సేవకులు


నర్సులను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: సేవే లక్ష్యం.. ప్రేమే మార్గంగా రోగులకు సేవలందిస్తున్న నర్సులు సమాజ సేవకులని ఉరవకొండ లయన్స్ క్లబ్ సభ్యులు కొనియాడారు. సోమవారం నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉత్తమ సేవలందించిన నర్సులను లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఈసందర్భంగా లయన్స్ అధ్యక్షుడు జయచంద్ర, గణేష్‌బాబు తదితరులు మాట్లాడారు. దాదాపు 15 మంది ఉత్తమ నర్సులను సన్మానించారు.

అర్ధనగ్న ప్రదర్శన


పంపుహౌస్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలు పరిష్కరించాలని శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కార్మికులు చేపట్టిన సమ్మె 37వ రోజుకు చేరుకుంది. కార్మికులు మాట్లాడుతూ ఏడు నెలల వేతనం, 30 నెలల పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్మికుల సమస్య పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం


కార్యకర్తకు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: హనకనహాళ్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ ప్రసాద్‌కు పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి రూ.50 వేలు సోమవారం ఆర్థికసాయం అందించారు. ఇటీవల బోయ ప్రసాద్‌ను పరామర్శించారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఆయనకు అండగా ఉంటానని మెట్టు భరోసా కల్పించారు. నగదును వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు వేమన, హళ్లి నాగరాజు, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు తిమ్మారెడ్డి, నాయకులు సుంకన్న, పెన్నోబలేశు పాల్గొన్నారు.

17న 'సేవ్ ఆర్డీటీ' బైకు ర్యాలీ


కంబదూరులో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర తలారి రంగయ్య ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించనున్న సేవ్ ఆర్డీటీ బైకు ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కంబదూరులో జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, ఎంపీపీ తనయుడు భీమేష్, పార్టీ కన్వీనర్లు హనుమంతరాయుడు, వెంకటప్ప, జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి నీలకంఠప్ప మాట్లాడారు. జిల్లాను ప్రపంచ పటంలో నిలిపిన ఘనత ఆర్డీటీకే దక్కుతుందన్నారు. సంస్థకు నిధులు రాకుండా కేంద్రం ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు దాదు, సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు కిరణ్, ఎంపీటీసీ మల్లేశు, నూతిమడుగు ఆనంద్, అండేపల్లి రామాంజనేయులు, తలారి రమేష్, మల్లారి వెంకటేశులు, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, గంగాధర్, నాగన్న, లింగమూర్తి, విల్సన్, బాబు, కొడతల ప్రసాద్ పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

గుమ్మఘట్ట: గ్రామాల్లో రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేకు రైతు లు సహకరిస్తే సంపూర్ణంగా విజయవంతమవుతుందన్నారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమయ్యేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

మిర్చి రైతు.. దిగాలు


రంగసముద్రం సమీపంలో మిర్చిని ఆరబెడుతున్న కూలీలు

పతనమైన ఎర్ర బంగారం ధరలు
- తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
- పెట్టుబడి తిరిగి రాక ఆత్మహత్యలే శరణ్యమంటున్న వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

గుమ్మఘట్ట: ధరలు ఆశాజనకంగా ఉన్నంత వరకూ మిర్చి పంట ఎర్ర బంగారమే.. ఆశించిన స్థాయిలో దిగుబడి ఉండాలి.. గిట్టుబాటు ధరలు దక్కాలి.. కానీ పంట చేతికొచ్చిన తర్వాత గతేడాది కంటే ధర పతనమవుతూ వస్తోంది. తక్కువ ధరకు పంట అమ్ముకోలేక.. చేసిన అప్పులు తీరక.. కూటమి ప్రభుత్వం కూడా అన్నదాతను ఆదుకోక బ్యాడిగ మిర్చి రైతు బావురమంటున్నాడు. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వేలాది మంది రైతులు బ్యాడిగ (డబ్బీ) రకం మిర్చి పంట సాగు చేశారు. గతేడాది ధరలు ఆశాజనకంగా ఉన్నాయని సాగుపై ఎక్కువగా మంది మొగ్గుచూపారు. ఎకరా పొలంలో మిర్చి పంటను సాగు చేయడానికి రూ.రెండు లక్షల వరకు పెట్టుబడుల రూపంలో ఖర్చు చేశారు. దుక్కి దున్నడం మొదలుకుని విత్తనాలు, రసాయన ఎరువులు, కలుపు మందులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చు తడిసి మోపడయ్యాయి. ఆశాజనకంగా ఉన్న సమయంలో బ్లాక్‌త్రిప్స్, వైరస్ తెగులు సోకి దిగుబడి తగ్గిపోయింది. ఎకరా పొలంలో మిర్చి పంట సాగు చేస్తే పది క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

పాతాళానికి పడిపోయిన ధరలు

సరిహద్దున ఉన్న బ్యాడిగ మార్కెట్ యార్డులో మిర్చి ధరలు పడిపోవడంతో అన్నదాతలు నష్టపోయారు. పెట్టుబడులు కూడా తిరిగిరాకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యమని అంటున్నారు. గత సీజన్‌లో క్వింటా ధర రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకు పలికింది. ఈ ఏడాది క్వింటా రూ.20 వేల నుంచి రూ.28 వేలు ఉండడంతో అన్నదాతలు పీకల్లోతు కష్టాల్లో పడిపోయారు.

రైతులను ఆదుకోవడం 'కూటమి' విఫలం..

మిర్చి పంటను సరిహద్దున ఉన్న కర్ణాటక రాష్ట్రంలో బ్యాడిగ మిర్చి మార్కెట్ యార్డుకు తరలించి రైతులు విక్రయిస్తున్నారు. మిర్చి పంట తుడిచిపెట్టుకుపోవడంతో రైతులు నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆదుకోవడంలో కూటమి సర్కారు విఫలమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను అన్నివిధాలుగా ఆదుకున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు గిట్టుబాటు ధర కల్పించారు.

నియోజకవర్గం	మిర్చి సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
రాయదుర్గం	4,400
కళ్యాణదుర్గం	238
ఉరవకొండ	8,250

5 ఎకరాలు కౌలుకు సాగు చేశా



గత సీజన్‌లో మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈసారి 5 ఎకరాలు రూ.లక్షకు కౌలుకు తీసుకొని డబ్బీ మిర్చి పంట సాగు చేశా. ఎకరాకు రూ.2 లక్షల చొప్పున ఐదెకరాలకు రూ.10 లక్షలు వెచ్చించా. పంట సకాలంలో చేతికందకపోవడంతో రూ.5 లక్షలు అప్పు అయ్యింది. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– గోవిందు రైతు, రంగసముద్రం, గ్రామం

రూ.2 లక్షలు అప్పు అయ్యింది



గతేడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో మాకున్న రెండు ఎకరాలలో డబ్బీ మిర్చి పంట సాగు చేశా. ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ.4 లక్షలు అప్పు చేశా. ఇంటిల్లిపాది ఆరుగాలం కష్టించాం. 15 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. మేలు రకం క్వింటా రూ. 30 వేలు, మధ్య రకం క్వింటా రూ.17 వేలు, చివరి రకం రూ.2 వేలకు విక్రయించినాం. పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. రూ.2లక్షలు అప్పు అయ్యింది.

– రంగస్వామి రైతు, డి.కొండాపురం గ్రామం

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఏటా ఠంచనుగా రైతు భరోసా కింద రూ.17,500 అందించి, రైతులకు అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రైతులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. మిర్చి పంట సాగు చేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మిర్చి రైతుకు మద్దతు ధర కల్పిస్తామని హామీలిచ్చి పట్టించుకోవడంలేదు. పంటను రైతుల నుంచి కూడా కొనుగోలు చేసింది లేదు. నష్టపోయిన మిర్చి రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి చిత్తశుద్ధిని చాటుకోవాలి.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

దరూరు పుల్లయ్య మరణం తీరని లోటు


బళ్లారిలో దరూరు పుల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి


మాజీ ఎంపీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మరణం రాయలసీమకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్ అన్నారు. సోమవారం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మరణ వార్త తెలుసుకొని బళ్లారిలోని పుల్లయ్య స్వగృహంలో ఉంచిన పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ అనంతపురం ఎంపీగా రెండుసార్లు గెలిచారని, జిల్లాను ఎడారి బారిన పడకుండా ఎంతో కృషి చేశారన్నారు. నీటి మళ్లింపుతోనే రాయలసీమ సస్యశామలం అవుతుందని ప్రజాతంత్ర శక్తులతో కలిసి ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. అనంతపురంలో ఏపీ లైటింగ్ సంస్థను స్థాపించి, ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారు. సిద్ధాంతాలు వేరైనా అభివృద్ధి కోసం కమ్యూనిస్టు మోధుడు వీకే ఆదినారాయణరెడ్డితో కలిసి పని చేశారన్నారు. ఉరవకొండ నియోజకవర్గానికి సైతం పుల్లయ్య ఎంతో సేవ చేశారని, ఆయన తనయుడు దరూరు రమేష్ తండ్రి బాటలోనే పయనిస్తూ ప్రజా సేవ చేస్తున్నారని తెలిపారు.

వజ్రకరూరు/ఉరవకొండ: వజ్రకరూరు మండలం ఛాయాపురానికి చెందిన మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య గుండెపోటుతో సోమవారం సాయంత్రం కర్ణాటకలోని బళ్లారిలో మరణించారు. ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి బళ్లారికి వెళ్లి పుల్లయ్య మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు, గుంతకల్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆర్.శ్రీనాథ్‌గౌడ్ తదితరులు కూడా బళ్లారికి వెళ్లి దరూరు పుల్లయ్యకు నివాళులర్పించారు.

కొనకొండ్లలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వజ్రకరూరు: కొనకొండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తనయుడు యువనేత, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని భీమా సూపర్ చాలెంజర్ క్రికెట్ టోర్నీను సోమవారం ప్రారంభించారు. ముందుగా దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీనాయక్‌కు రెండు మౌనం పాటించారు. అనంతరం భీమిరెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ భీమిరెడ్డి సూచనల మేరకు క్రికెట్ టోర్నమెంట్‌ను వీర జవాన్ మురళీనాయక్‌కు అంకితమిస్తున్నట్లు వెల్లడించారు.టోర్నీ 20 రోజులపాటు జరుగుతుందని, 78 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేత జట్టుకు రూ.40116, రన్నర్ జట్టుకు రూ.20116 అందించనున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీలు రామచంద్ర, రమణారెడ్డి, మాజీ సర్పంచు ఉన్నం మారుతి, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, జరుట్ల రాంపురం సర్పంచు తిరుపాల్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయ కులు లాలెప్ప, దేవేంద్ర, బోయ తిమ్మప్ప, మహిళా నాయకురాలు శ్రీలేఖ, క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు హరి, రాజశేఖర్ యాదవ్, హరికృష్ణ, దినేష్, లోకేష్, ఆకులరాజు, శివ, చుక్కా రామాంజి, బ్రహ్మయ్య, సురేష్, దేవేంద్ర, గోపాల్‌కృష్ణ, నాగరాజు, హరి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం


లక్ష్మీనవ నరసింహస్వామి కల్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: మల్లాపురం విప్రమలై క్షేత్రంలో వెలసిన లక్ష్మీనవ నరసింహస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం స్వామి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై పూజలు చేశారు.

జోడు లింగాలకు రుద్రాభిషేకం

కూడేరు: కూడేరులో అతిపురాతన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో జోడు లింగాలకు సోమవారం రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున శివపార్వతులను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు సర్వసభ్య సమావేశం

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కణేకల్లు: మండలంలోని సొల్లాపురం గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నీటి సమస్య గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ఒక్కటే తమ గ్రామానికి ప్రధాన ఆధారమని, ఈ సిస్టమ్ ద్వారా నీటి సరఫరా బంద్ కావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

నలుగురు టెక్నికల్ అసిస్టెంట్ల నియామకం

వజ్రకరూరు: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లు నియామకమైనట్లు ఏపీఓ లక్ష్మీకాంత బాయి సోమవారం తెలిపారు. ఉరవకొండ, గుంతకల్లు, గుత్తి మండలాల్లో టీఏలుగా పనిచేస్తున్న జగన్నాథ్, వన్నప్ప, సుధాకర్, ఆచారి తదితరులు వజ్రకరూరు మండలానికి బదిలీ అయినట్లు ఏపీఓ తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు హరి, ఎర్రిస్వామి, మైసురారెడ్డి, శివకుమార్ తదితరులు గుంతకల్లు, విడపనకల్ మండలాలకు బదిలీ అయినట్లు ఏపీఓ తెలిపారు.

టీఏకు ఈసీగా అదనపు బాధ్యతలు

వజ్రకరూరు: మండలంలోని గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ వన్నప్పకు ఈసీగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఏపీఓ లక్ష్మీకాంతబాయి సోమవారం తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఈసీ ప్రభాకర్ గుత్తి మండలానికి బదిలీ అయ్యారు.

విద్యుత్ లైన్ల పునరుద్ధరణ

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ లైన్లు పునరుద్ధరణ పనులు చేస్తున్నట్లు ఏఈ సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గాజుల మల్లాపురానికి విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం పది గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బొమ్మనహాళ్: మండలంలోని కోనాపురం వద్ద పేకాట స్థావరంపై ఎస్ఐ శివ ఆధ్వర్యంలో సోమవారం దాడులు చేశారు. ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.22,350 నగదు, ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పోలీసులు రవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శివాజీరెడ్డి

వజ్రకరూరు: ఎంపీడీఓగా వి.శివాజీరెడ్డి నియమితులయ్యారు. గుత్తి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న వి.శివాజీరెడ్డి పదోన్నతిపై వజ్రకరూరుకు వచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన శివాజీరెడ్డికి సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆలయ భూములను పరిరక్షించండి

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో ఆలయ భూములను పరిరక్షించాలని మాజీ సర్పంచ్ మారుతీప్రసాద్ కోరారు. సోమవారం తహసీల్దార్ మునివేలును కలిసి విన్నవించారు. ఉద్దేహాళ్‌లోని 238-1, 238-2 సర్వే నంబర్‌లో 0.78, 0.78, 1.45 ఎకరాల భూమిని శేఖర్ అనే వ్యక్తికి ఎలా ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. షాపింగ్ కాంప్లెక్స్ తొలగించి, భూమిని స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఆదేశాలున్నా పట్టించుకోలేదన్నారు.

కుందుర్పి జెడ్పీటీసీకి పరామర్శ


కుందుర్పి జెడ్పీటీసీ రాధాస్వామికి ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుందుర్పి జెడ్పీటీసీ రాధాస్వామిని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త, పీఏసీ సభ్యుడు డాక్టర్ తలారి రంగయ్య పరామర్శించారు. సోమవారం బెంగళూరుకు వెళ్లి రాధాస్వామి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాద వివరాలపై ఆరా తీశారు. అనంతరం తనవంతు సాయంగా వైద్య ఖర్చులకు రూ.40 వేలు అందించారు. రాధాస్వామి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పార్టీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, కళ్యాణదుర్గం మండల కన్వీనర్ గోళ్ల సూరి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు దొడగట్ట మురళి, మల్లికార్జున, భీమప్ప పాల్గొన్నారు.

హజ్ యాత్రకు వెళ్లిన ముస్లింలు


హజ్‌కు తరలివెళ్తున్న యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్ : పట్టణం నుంచి ఆరుగురు యాత్రికుల సభ్యుల బృందం సోమవారం హజ్ యాత్రకు తరలివెళ్లింది. స్థానిక ఉస్మాన్ మసీదులో హజ్‌యాత్రకు వెళ్తున్న వారిని జమాత్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సత్కరించారు. అంతకుముందు ముఫ్తీ నూర్ మహమ్మద్ వారి యాత్ర సాఫీగా సాగాలని కోరుతూ సామూహిక దువా పఠించారు. టైర్ల వ్యాపారి నూరి దంపతులు, బిస్మిల్లా జనరల్ స్టోర్ యజమాని నలుగురు కుటుంబ సభ్యులు వెళ్లారు.

రథం ట్రయల్ రన్


రథం ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

ఉరవకొండ: ఈనెల 17న జరగనున్న పెన్నహోబిలం రథోత్సవం సందర్భంగా సోమవారం చేపట్టిన రథం ట్రయల్ రన్ విజయవంతమైంది. ఈఓ సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ జేఈ కావ్య, ఎస్ఐ జనార్దన్ నాయుడు పర్యవేక్షణలో ట్రయల్ రన్ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకా నాథచార్యులు ఆధ్వర్యంలో రథానికి పూజలు నిర్వహించి, భక్తులు ముందుకు లాగారు. రథం ముందుకు కదలకపోవడంతో తాళ్లు కట్టి రథాన్ని లాగారు. రథాన్ని జేఈ కావ్య పరిశీలించారు.

పాడుబడినా.. పట్టించుకోరా?


కూలే స్థితిలో ఉన్న సొసైటీ బ్యాంక్ భవనం

కూడేరు: కూడేరులో ఉన్న కూడేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పాతబడి గోడలు నెర్రెలు చీలి కూలేందుకు సిద్ధంగా ఉంది. పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులూడి పడుతున్నాయి. సిబ్బంది, రైతులు ఇబ్బంది పడుతున్నారు. బ్యాంక్ పరిధిలో సుమారు 1100లకు పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు.

ఆర్డీటీపై కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదు



కణేకల్లులో ర్యాలీ చేస్తున్న యువకులు



కంబదూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు


కూడేరు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కూడేరు: ఆర్డీటీ కులమతాలకతీతంగా నిరుపేదలకు నిస్వార్థంతో సేవలందిస్తుంటే కేంద్రం విదేశీ నిధులను అడ్డుకోవడం సరికాదని ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి, రాజకీయ పార్టీలు, ప్రజా, దళిత, గిరిజన, వికలాంగ, మహిళా సంఘాల నేతలు మండిపడ్డారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ధర్నా చేశారు. అనంతరం డీటీ సూర్యప్రతాప్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి , దండోరా నాయకులు రాజు, లక్ష్మన్న, గిరిజన సంఘం నాయకుడు శంకర్ నాయక్, మహిళా సంఘ సభ్యురాళ్లు, వికలాంగులు పాల్గొన్నారు.

కణేకల్లు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని స్థానిక సంజయ్‌నగర్‌కు చెందిన యువకులు ర్యాలీ చేశారు. సంజయ్‌నగర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు.

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష సాధింపు ధోరణి మానుకోవాలని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కంబదూరులో ప్రజాసంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ బాలకిషన్‌కు వినతిపత్రం అందించారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు దాబా రమేష్, ఉపాధ్యక్షుడు గోపాల్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గంగాధర్, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

కూడేరు: వీరజవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతికలగాలని ఉదిరిపికొండలో పార్టీలకతీతంగా సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. తొలుత మురళీ నాయక్ చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కుమ్మర రామ్మోహన్, క్రిష్టప్ప, నరేష్, నాగేంద్ర, టీడీపీ నాయకులు విరుపాక్షి , మహేష్, బద్రి, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుందుర్పి: వీర జవాన్ ఆత్మకు శాంతి కలగాలని మండల కేంద్రంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, మహిళా విభాగం డివిజన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, నాయకులు సర్పంచ్‌లు అతావుల్లా, రామూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు రాజగోపాల్ నాయకులు పెద్ద ఓబులేసు, వార్డు సభ్యులు మంజునాథ, టీడీపీ, సీపీఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కుందుర్పిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఉదిరిపికొండలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు